


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 45 | బుధవారం 15 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం



2

- కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్ కారణమన్న పొన్నం ప్రభాకర్
- మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శ
- ఎల్ఎన్ఓను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని వెల్లడి

## అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు: రేవంత్ రెడ్డి

- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి
- 2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన
- వేగంగా భూసేకరణ పూర్తి చేయడం పై తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం

వార్త సాక్ష్యం జూలై 14

అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు.



2

## భారతీయుడి మృతితో కేంద్రం సీరియస్.. ఇరాన్‌కు భారత్ గట్టి హెచ్చరిక

- హర్మూజ్ దాడిలో భారతీయుడి మృతి
- మరో ఆరుగురు భారతీయులకు గాయాలు
- ఇరాన్ రాయబారిని పిలిపించిన భారత్
- దాడి పై అధికారిక నిరసన నమోదు
- రెండు చమురు ట్యాంకర్లకు నష్టం
- ఘటనను తీవ్రంగా ఖండించిన యూఏఈ



2

## చైనాను వణికిస్తున్న టైఫూన్ ‘బావి’.. తెగిపడిన లైట్‌హౌస్ హైటెన్షన్ విద్యుత్ లైన్

వార్త సాక్ష్యం జూలై 14

చైనాలో టైఫూన్ బావి బీభత్సం సృష్టిస్తోంది. ఈ తుఫాను ప్రభావంతో లియావోనింగ్ ప్రావిన్స్‌లో భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. దీంతో 2,60,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించినట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం కూడా పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ -మిగతా2లో



## అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి: సీఎం చంద్రబాబు



2

- మంత్రులు, కార్యదర్శులతో సీఎం చంద్రబాబు సమావేశం
- సమస్య రాకముందే పసిగట్టాలి.. అదే సమర్థత అన్న చంద్రబాబు
- అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి.. నాలుగు గోడలకే పరిమితం కావొద్దని సూచన

## సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత



2

- కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు
- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచిన నేత
- కాపు ఉద్యమ నేతగా రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర

## కాళేశ్వరం పై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

వార్త సాక్ష్యం జూలై 14

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బ తీసేందుకు కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో, గోదావరి జలాలను ఉద్దేశపూర్వకంగానే సముద్రం పాలు చేస్తూ రైతులను ఇబ్బందు ల్లోకి నెడుతున్నారని ఆయన మండిపడ్డారు. -మిగతా2లో



2

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

## ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు తెలియజేస్తాం

నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగి పోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటు ందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

## చైనాను వణికిస్తున్న టైఫూన్ ‘బావి’.. తెగిపడిన లైట్‌హౌస్ హైటెన్షన్ విద్యుత్ లైన్

అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. టైఫూన్ బావి భారీ స్థాయిలో ఉష్ణ మండల తేమను ఉత్తర చైనా వైపు తీసుకురావడంతో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించింది. లియావోనింగ్ రాజధాని షెన్యాంగ్‌లో వరద ఉద్ధృతికి ఓ లైట్‌హౌస్‌కు చెందిన హైటెన్షన్ విద్యుత్ లైన్ తెగిపోయింది. అది వరద నీటిలో కొట్టుకుపోతూ ప్రధాన రహదారులపై, వంతెన కిందుగా తేలుతూ వెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తుఫాన్ తీవ్రత దృష్ట్యా అన్ని పాఠశాలలు, శిక్షణ సంస్థలకు సెలవులు ప్రకటించారు. షెన్యాంగ్, జిలిన్ సహా పలు ఈశాన్య నగరాల్లో రవాణా సేవలు కూడా నిలిచిపోయాయి. 13 రోజుల క్రితం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్.. ఫ్రాన్స్ దేశమంత విస్తీర్ణాన్ని కలిగి ఉంది. శనివారం రాత్రి తూర్పు చైనాలో తీరం దాటినప్పటికీ దాని ప్రభావం ఇంకా కొనసాగుతోందని వాతావరణ నిపుణులు తెలిపారు. దీంతో ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో ఈ ఏడాది అత్యంత ఎక్కువ కాలం కొనసాగిన ఉష్ణ మండల తుఫాన్‌గా టైఫూన్ నిలిచింది. చైనా వాతావరణ శాస్త్రవేత్తల ప్రకారం, తుఫాన్‌లోని ‘వార్మ్ కోర్’ (వెచ్చని కేంద్ర భాగం) బలంగా ఉండటంతో టైఫూన్ భారీ తేమను నిల్వ చేసుకుంటూ ఉత్తర దిశగా, కొరియా ద్వీపకల్పం వైపు కదులుతోంది. తుఫాన్ వేగం తగ్గే కొద్దీ అందులోని తేమ ఒక్కసారిగా విడుదలై మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

## కాళేశ్వరం పై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు.. కేటీఆర్ సంచలన ఆరోపణలు

వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు చొరవ చూపడం లేదని విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా పంటలు ఎండిపోవడమే కాకుండా, హైదరాబాద్, కరీంనగర్ వంటి ప్రధాన నగరాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరికి వరద ప్రవాహం లేదంటూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నీటిని విజయవంతంగా ఎత్తిపోస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మరమ్మతులు పూర్తయినప్పటికీ, కేవలం రాజకీయ దురుద్దేశంతో ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదికను సాకుగా చూపి తెలంగాణ ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ ప్రాజెక్టుకు చెడ్డపేరు తెచ్చేందుకే కాంగ్రెస్, బీజేపీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి

ఎల్‌నినో ప్రభావం పై తెలంగాణలోని రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచనలు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్రమంలో రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు. తెలంగాణలో 30 నుంచి 35 శాతం తక్కువ వర్షపాతం నమోదయిందని భారత వాతావరణ విభాగం వెల్లడించిందని తెలిపారు. వచ్చే మూడు నెలలూ వర్షాభావ పరిస్థితులే ఉండవచ్చని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల లభ్యత కూడా తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన సూచించారు. వరి, చెరకు వంటి అధిక నీటి పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వారికి వివరించారు. జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు మంత్రి తుమ్మల వివరించారు. తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే వంగడాలు ఎంచుకోవాలని రైతులకు స్పష్టం చేశారు. వ్యవసాయ, నీటి పారుదల, భూగర్భ జలాలు – భారత వాతావరణ విభాగం సమన్వయంతో రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తామని చెప్పారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. చిరు ధాన్యాల సాగు పెంచాలని హైదరాబాద్‌లోని ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ సూచించిందని గుర్తు చేశారు.

# అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు: రేవంత్ రెడ్డి

రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను (ఫ్లీూ) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

## భారతీయుడి మృతితో కేంద్రం సీరియస్.. ఇరాన్‌కు భారత్ గట్టి హెచ్చరిక!

హర్మూజ్ జలసంధిలో యూఏఈకి చెందిన చమురు ట్యాంకర్లపై జరిగిన దాడిలో ఓ భారతీయుడు మరణించిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించి భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మహ్మద్ జావెద్ హుస్సేనీని విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. ఒమన్‌కు సమీపంలోని హర్మూజ్ జలసంధి దక్షిణ మార్గంలో ప్రయాణిస్తున్న ‘మొంబాసా’, ‘అల్ బహియాహ్’ చమురు ట్యాంకర్లపై ఈ దాడి జరిగింది. ‘మొంబాసా’ నౌకలో పనిచేస్తున్న ఓ భారతీయ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడగా, వారిలో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాడి కారణంగా రెండు ట్యాంకర్లలోనూ మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. అయితే వెంటనే సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో రెండు నౌకలకు భారీ నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఈ దాడిని అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఖండించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వానికి ఇది తీవ్ర ముప్పు అని అభివర్ణించింది. ఈ పరిణామంపై స్పందించే పూర్తి హక్కు యూఏఈకి ఉందని స్పష్టం చేసింది. దేశ భద్రత, ప్రజలు, జాతీయ ప్రయోజనాలు, కీలక ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

## అసలు సమస్యే రాకుండా చూసేవాడు అద్భుతమైన అధికారి: సీఎం చంద్రబాబు

“సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించేవాడు మంచి అధికారి అయితే, అసలు సమస్యే తలెత్తకుండా ముందుచూపుతో పనిచేసేవాడు అద్భుతమైన అధికారి. ఆ కోణంలో అధికారులు పనిచేయాలి” అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలియాలంటే అధికారులు నాలుగు గోడలు దాటి ప్రజల్లోకి వెళ్లాల్సిందేనని, వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లగలమని హితవు పలికారు. మంగళవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం మాట్లాడారు.

**డేటా ఆధారిత పాలన.. నెలవారీ నివేదికలతో సమీక్ష**

డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ ఫలితాలు సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికోసం దేశంలోనే మొదటిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా రాష్ట్ర ప్రగతిని సమీక్షించుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. “ఇకపై ప్రతీ నెలా ఆర్థిక నివేదికలు విడుదల చేస్తాం. వాటి ఆధారంగా ప్రభుత్వ శాఖల పనితీరు, రెవెన్యూ రాబడులు, అధికారుల నైపుణ్యాలను అంచనా వేసుకుని ముందుకు వెళ్తాం. ప్రతీ నెలా కార్యదర్శులు, హెచ్‌వోడీలతో సమావేశమై పురోగతిని సమీక్షించుకుందాం,” అని తెలిపారు. గత ఐదేళ్ల (2019–24) పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయని, విధ్వంసం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. “గత రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం సమిష్టిగా పనిచేసి, క్షేత్రస్థాయిలో కొంతవరకు మార్పు తేగలిగాం. గత పాలనలో పారిశ్రామికవేత్తలకు ఏపీపై నమ్మకం పోయింది. మేం వచ్చాక పరిస్థితి మార్చి, దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ ఇప్పుడు పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం” అని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ‘స్వర్ణాంధ్ర–2047’ విజన్‌ను రూపొందించామని, తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్నామని వివరించారు.

**అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి**

ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని శాఖల పనితీరు సరిగా లేకపోవడంతో, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో భూ వివాదాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయని పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ లో ‘జీరో పెండెన్సీ’ లక్ష్యంగా పెట్టుకోవాలని అన్ని శాఖలకు సూచించారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి ప్రాంతాల్లో భూ సమస్యలను పరిష్కరించామని, రీసర్వే ద్వారా ప్రతి నెలా 9వ తేదీన రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు.

**ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల పై స్పష్టత**

రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో దృష్టి సారించిందని సీఎం తెలిపారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆగస్టు 14న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేస్తామని, సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

# సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన ‘కాపు ఐక్య గర్జన’ సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును ‘ముద్రగడ పద్మనాభరెడ్డి’గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు. గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.

# సింగరేణికి పట్టిన శని ఆ రెండు పార్టీలే.. దోచుకుతిన్నారు

తెలంగాణకు గుండెచప్పుడు లాంటి సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి నిలువునా ముంచేశాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ పాలకులు పోటీపడి మరీ సింగరేణిని తమ సొంత ఖజానాలా వాడుకున్నారని మండిపడ్డారు. కార్మికుల చెమట వాసన తెలిసిన సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టి, ఇప్పుడు దాని భవిష్యత్తును పూర్తిగా అంధకారంలోకి నెట్టేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సింగరేణి నుంచి బొగ్గు కొనుగోలు చేసి, విద్యుత్ వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తుంగలో తొక్కిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెట్టిపోతే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి మరో రూ. 24 వేల కోట్లు జోడించిందని మండిపడ్డారు. ఇలా మొత్తం రూ. 54 వేల కోట్ల కార్మికుల కష్టార్జితాన్ని అప్పులపాలు చేసి, సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి తోశారని ఆరోపించారు. కేసీఆర్ తన హయాంలో సింగరేణి బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చి, టెండర్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. రాజకీయాలు చేయడానికి తాను ఇక్కడికి రాలేదని, సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గత పాలకులు సంస్థ ఆదాయాన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లు వంటి అనవసరమైన వాటికి మళ్లించారని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ హయాంలో సింగరేణికి తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయించి కార్మికులకు అసలైన భరోసా కల్పించామన్నారు. సింగరేణి మనుగడ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా కేంద్రం అండగా నిలబడుతుందని, కార్మికుల ప్రయోజనాలను కాపాడి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

-ఏబీవీపీ ఆధ్వర్యంలో నంగునూరులో ప్రభుత్వ కళాశాల బంద్

-విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



నంగునూరు, జూలై 14 వార్త సాక్ష్యం

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల వద్ద బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఏబీవీపీ నాయకులు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు రూ. 12,000 కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక పలువురు విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమం శాంతియుతంగా కొనసాగగా, కళాశాల వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం ఏబీవీపీ నాయకులు తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిరసనను ముగించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మండల కార్యకర్తలు పెద్ది లవన్ రెడ్డి, సూర్యం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీల్లో దొంగల ముఠా అరెస్ట్

-గొర్రె మేక లను దొంగిలించి విక్రయించిన ముగ్గురు యువకులు పట్టివేత

-రూ.25 వేల నగదు, ఆటో, సెల్‌ఫోన్లు స్వాధీనం

-ఆత్మకూరు సీఐ ఆర్. సంతోష్




ఆత్మకూరు, జూలై 14 వార్త సాక్ష్యం

ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో చోరీ కేసును ఛేదించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆత్మకూరు సీఐ ఆర్. సంతోష్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి చోరీ సొమ్ముతో పాటు నగదు, ఆటో, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం దుర్గంపేట గ్రామం సమీపంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఒక ఆటోలో ప్రయాణిస్తున్న తనుగుల రాజు, జన్ను అజయ్, ఎలుమకంటి విశాల్ లను పోలీసులు ఆపి విచారించారు. ప్రారంభంలో వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో మరింత లోతుగా విచారణ చేపట్టారు. విచారణలో సోమవారం రాత్రి వరంగల్‌లో మద్యం సేవించిన అనంతరం ఆత్మకూరు వైపు బయలుదేరినట్లు, శ్యాంపేటకు వెళ్తున్న క్రమంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గొర్రెల పాకలో నుంచి ఒక గొర్రె పొట్టేలు, ఒక మేకపోతును దొంగిలించినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. అనంతరం వాటిని హుస్నాబాద్ అంగడిలో విక్రయించి రూ.25 వేల నగదు పొందినట్లు, ఆ సొమ్మును ముగ్గురు పరస్పరం పంచుకున్నట్లు విచారణలో వెల్లడించారని చెప్పారు. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 25 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, నేరానికి వినియోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ పశువుల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ ఆర్. సంతోష్ విజ్ఞప్తి చేశారు. ఈ వాహనాల తనిఖీల్లో ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పనులను క్షేత్రస్థాయిలో

# మరింత సమర్థవంతంగా అమలు చేయాలి

-గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించాలి

-ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

-ప్రజా పాలన రెండో విడతకు అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

-రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి ప్రజా పాలన జిల్లా ప్రత్యేక అధికారి బి. షఫీయుల్లా






నాగర్ కర్నూల్ జులై 14 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపునిచ్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి, ప్రజా పాలన జిల్లా ప్రత్యేక అధికారి బి. షఫీయుల్లా అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత, మొక్కల పెంపకం, ప్రజారోగ్య పరిరక్షణ వంటి కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించే విధంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గృహ నిర్మాణ, జిల్లా ప్రణాళిక, జిల్లా పంచాయతీరాజ్, మైనారిటీ సంక్షేమ, పశుసంవర్ధక, వ్యవసాయ, ఆర్ అండ్ బి, డీఆర్‌డీఏ, డీఎంహెచ్‌వో, రెవెన్యూ తదితర శాఖల జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై విస్తృత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, భవిష్యత్ కార్యాచరణపై శాఖల వారీగా సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి షఫీయుల్లా మాట్లాడుతూ.... గత నెలలో జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం సిద్ధం చేసిన నివేదిక ఆధారంగా హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమక్షంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రగతిని వివరించినట్లు తెలిపారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా పాలన కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న తీరు రాష్ట్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించిందని, జిల్లాలో అధికారులు చూపుతున్న చొరవపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో జిల్లా అధికారులు చేపట్టిన చర్యలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, సుమారు 18 వేల మంది రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించి వ్యవసాయంలో వినియోగించేలా చేసిన చర్యలు రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్నాయని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయడం ద్వారా ఉత్పాదకత పెరగడంతో పాటు ఎరువుల వినియోగం కూడా సమర్థవంతంగా జరుగుతుందని ఆయన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక తొలి విడత జిల్లాలో విజయవంతంగా పూర్తయిందని, ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు త్వరలోనే రెండో విడత కార్యక్రమాన్ని సైతం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

-కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం

రెండో విడత ప్రారంభానికి ముందే అన్ని శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకొని, గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి అమలు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనిచేయాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. జిల్లాలో ప్రతి శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై రాష్ట్రస్థాయిలో నిరంతర సమీక్ష జరుగుతోందని ఆయన తెలిపారు. శాఖలు చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాలు, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగిస్తున్న విజయగాథలను సకాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని సూచించారు. ఇందిరమ్మ గృహాల పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొంటూ, ఎల్-3 జాబితాలో అర్హత పొందిన లబ్ధిదారులకు గృహాల మంజూరు ప్రక్రియకు సంబంధించిన నిబంధనలపై రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. పేద కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో భవనాలు లేని 134 గ్రామపంచాయతీలకు కొత్త పంచాయతీ భవనాల నిర్మాణం కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతులను పొందేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణం గ్రామ పరిపాలనను మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. పశు సంవర్ధక శాఖ ద్వారా జిల్లాలోని సుమారు 11 లక్షల పశువులకు డీ-వార్మింగ్ మందుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాకు చేరేలా అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. పశుసంపద ఆరోగ్యవంతంగా ఉంటే రైతుల ఆదాయం పెరుగుతు ందని, పాల ఉత్పత్తి, పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. మినుములు, పెసర్లు, కూరగాయలు, ఉద్యాన పంటలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సలహాలు అందించడంతో పాటు విత్తనాలు, ఎరువులు, సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాలల బాలికలతో 450 స్నేహ గ్రూపులను ఏర్పాటు చేసి మాక్ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్న కార్యక్రమమని ప్రత్యేక అధికారి షఫీయుల్లా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతున్నాయని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో తల్లి శిశువుల రక్తహీనత సమస్యను తగ్గించేలా జిల్లాలో బాలామృతం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో నిర్వహిస్తున్న శాఖలోని ఈ వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అదేవిధంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీలు, రోడ్డు భద్రత కార్యక్రమాలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు, మొక్కల పెంపకం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి చేరేలా ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజా పాలన రెండో విడతలో నాగర్‌కర్నూల్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రత్యేక అధికారి బి. షఫీయుల్లా సూచించారు. అదేవిధంగా జిల్లాలో షాదీ ముబారక్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి లబ్ధిదారులకు డబ్బులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. షాది ముబారక్ పంపిణీకి జిల్లాలో నిధుల కొరత లేదని, షాదీ ముబారక్ దరఖాస్తులను పరిష్కరించి లబ్ధిదారులకు డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ. జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధి పనులతో పాటు కొనసాగుతున్న కార్యక్రమాల వివరాలను ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చిన దరఖాస్తులన్నిటిని చెప్పే స్థాయిలో పరిశీలించి అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర , అదనపు కలెక్టర్ రెవిన్యూ ఇంచార్జ్ అరుణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు గోపాల్ నాయక్, చిన్న ఓబులేష్, రమాదేవి, డాక్టర్ కృష్ణ, శ్రీరాములు, జ్ఞాన శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు ఓటుపట్ల చైతన్యం కావాలి - స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజ

ఖమ్మం జిల్లా జులై 15 వార్త సాక్ష్యం

ప్రతి ఓటరు చైతన్యం కావాలని, కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన సర్ సవరణలో భాగంగా తమ ఓటును నమోదు చేసుకోవాలని ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్ శ్రీజ ఓటర్లకు తెలియజేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ సర్ 2026లో భాగంగా మంగళవారం ఆమె వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6 వార్డులో నేరుగా ఓటర్లకు సర్ అవగాహన నిర్వహించారు. గత నెల 25న తెలంగాణతోపాటు 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల గణన ప్రక్రియ ప్రారంభమైందని, దీనికి గాను బిఎల్వోలు ఇంటికి వచ్చి ఎన్యుమరేషన్ ఫారంను ఇవ్వడం జరుగుతుందని, దానిని జాగ్రత్తగా ఫ్యామిలీ వివరాలతో పూర్తి చేసి తిరిగి బిఎల్ఓకు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై ప్రతి ఓటరు చైతన్యంగా ఉండి నిర్లక్ష్యం చేయకుండా ఓట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని ఎలాంటి లోపాలు లేకుండా నింపి బిఎల్ఓ కు ఈనెల 24 లోగా తిరిగి ఇవ్వాలని, అప్పుడే వారి పేరు ఓటర్ల జాబితాలో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. లేనిపక్షంలో అర్హులై ఉండి కూడా, ఓటును పోగొట్టుకుంటారని అన్నారు. దేశంలోకి కొత్తగా చొరబడిన వారు, ఒకే వ్యక్తి రెండు, మూడు చోట్ల ఓట్లు కలిగి ఉండిన వారు, చనిపోయిన వారి ఓట్లు అనర్హులని, అలాంటి వారి ఓట్లు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫారం లు సరిగా అవగాహన లేక నింప లేకపోతే బిఎల్ వో లు, బిఎల్ఏలు దగ్గరుండి ఫారంలు నింపించాల్సిన అవసరం ఉందని, లేకపోతే అర్హులైన ఓట్లు తొలగించబడే అవకాశం ఉందన్నారు. నిర్దేశించిన ఈనెల 24వ తేదీని పొడిగించే అవకాశం కూడా లేదని ఎన్నికల సంఘం ప్రకటించడం జరిగిందని చెప్పారు. పేర్లలో ఏమైనా మార్పులు ఉంటే బిఎల్వోలు దగ్గర ఫారం 6, ఫారశీ 8 ద్వారా సరి చేయించుకోవచ్చని అన్నారు. రెండు, మూడు చోట్ల ఓట్లు కలిగి ఉన్నవారు శిక్షార్హులతారని తెలిపారు. ప్రతి ఓటరు సర్ పట్ల శ్రద్ధతో ఉండాలని, ఫారంను జాగ్రత్తగా నింపి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేష్ బాబు, డిఎల్ఓ ఫాతిమా, ఏ ఎల్ ఓ,వార్డ్ ఆఫీసర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR



# తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్ నియామకం

హైదరాబాద్ జూలై 14 వార్త సాక్ష్యం

ప్రతిష్టాత్మక తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాషా పరిరక్షణ,పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భూమిక పోషించే తెలుగు అకాడమీ సారధ్య బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్ కు అప్పగించడం పట్ల పలువురు విద్యావేత్తలు,ఆచార్యులు, పరిశోధకులు గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.?ఆచార్య భట్టు రమేష్ కు ఉన్నత విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధనానుభవం ఉంది.సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అత్యుత్తమ సేవలందించారు. వీటితో పాటు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతిగా,గిరిజన అధ్యయన శాఖ అధిపతిగా, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు. గిరిజన సామాజిక నేపథ్యం నుండి వచ్చిన ఆచార్య రమేష్ జానపద,గిరిజన సంస్కృతుల పరిరక్షణకు విశేష కృషి చేశారు.తన కెరీర్‌లో పలు మేజర్,మైనర్ పరిశోధన ప్రాజెక్టులను చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. అనేక అంతర్జాతీయ,జాతీయ సదస్సులలో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించారు. జానపద గిరిజన విజ్ఞానానికి సంబంధించి 30కి పైగా పరిశోధనా గ్రంథాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. కాగా 7 పుస్తకాలను సొంతంగా ప్రచురించారు .గిరిజన బాలల కోసం 'బంజారా భారతి','బంజారా గణితం' వంటి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు.ఆయన పర్యవేక్షణలో పలువురు పరిశోధకులు ఎంఫిల్, పిహెచ్.డి పట్టాలను అందుకున్నారు. ఆచార్య భట్టు రమేష్ కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజ శ్రేయస్సు కోరి వివిధ పబ్లిక్ కమిటీల్లో భాగస్వామ్యం వహించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలంలో పీపుల్స్ వార్ గ్రూప్,జనశక్తి వంటి పార్టీలతో జరిపిన శాంతి చర్చలలో మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా, రాష్ట్ర స్థాయి మద్యపాన నిషేధ సలహా కమిటీ సభ్యుడిగా, గిరిజన భూ రక్షణ చట్టాల పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా సేవలందించారు. వరంగల్ జిల్లాలో గుడుంబా బాధితులైన 200 పైగా గ్రామాల్లోని యువ గిరిజన వితంతువుల సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించి,వారి పునరావాసం కోసం జిల్లా కలెక్టర్ సహాయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు.అలాగే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై పని చేసి నివేదికలను అందించి వారి అభివృద్ధికి కృషి చేశారు.ఆయన విద్యా సేవలను గుర్తిస్తూ 2014 లో తెలంగాణ ప్రభుత్వం నుండి 'రాష్ట్ర స్థాయి ఉత్తమ



ఉపాధ్యాయ అవార్డు' లభించింది.అలాగే గిరిజన సాహిత్యం,జానపద కళల రంగంలో ఆయన చేసిన కృషికి గాను 2017లో 'డా.బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ అవార్డు' వరించింది. ఈ సందర్భంగా తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్ గా నియమితులైన ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అకాడమీ ద్వారా తెలుగు భాషా వికాసానికి, పాఠ్యపుస్తకాల ప్రచురణకు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తన వంతుగా శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# రైతులకు ఎరువుల కొరత లేదు

**-అవసరానికి మించి కొనొద్దు**
**-అవకతవకలు జరిగితే కఠిన చర్యలు...**
**-జల హారతి--జల ధార'తో 0.69 టీఎంసీల నిల్వ...**

గుంటూరు జూలై 14 వార్త సాక్ష్యం

జిల్లాలో ఖరీఫ్-2026 సీజన్‌కు అవసరమైన యూరియా, డీఏపీతో పాటు అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేసి నిల్వ చేయొద్దని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు మొత్తం 58,481 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేయగా, అందులో యూరియా, డీఏపీ అవసరం 41,028 మెట్రిక్ టన్నులు అని తెలిపారు. ఇప్పటివరకు 13,509 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించగా, అందులో 5,765 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ రైతులకు అందించినట్లు వివరించారు. జూలై నెలాఖరు వరకు 14,034 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని, ప్రస్తుతం జిల్లాలో 41,494 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు, అందులో 19,193 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆగస్టు వరకు అవసరాలకు సరిపడా యూరియా, డీఏపీ నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. జూలై నెలకు జిల్లాకు 19,020 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించగా, ఇప్పటివరకు 6,505 మెట్రిక్ టన్నులు చేరాయని, మిగిలిన 12,515 మెట్రిక్ టన్నులు త్వరలో జిల్లాకు చేరనున్నాయని తెలిపారు. జిల్లాలో ఎరువుల విక్రయాలు పూర్తిగా APAIమీ యాప్ ద్వారానే జరుగుతున్నాయని చెప్పారు. జూన్ 8 నుంచి ఇప్పటివరకు 6,049 మంది రైతులకు 1,789.9 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ ాూాూ×మీా ద్వారా విక్రయించినట్లు వెల్లడించారు. రైతులు తప్పనిసరిగా APAIMS ద్వారానే ఎరువులు కొనుగోలు చేయాలని, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగాన్ని పాటించాలని సూచించారు. ఎరువుల సరఫరాపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, అధిక ధరలకు విక్రయించడం, బలవంతపు ట్యాగింగ్, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, ఎరువుల మళ్లింపు లేదా



విక్రయాలను నిరాకరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.అనంతరం 'జల హారతి--జల ధార' కార్యక్రమంపై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా జిల్లాలో చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల పునరుద్ధరణ ద్వారా 0.69 టీఎంసీల అదనపు నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించినట్లు తెలిపారు. ఈ చర్యలతో వర్షపు నీటి నిల్వ పెరిగి, భూగర్భ జలాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయం, తాగునీటి అవసరాలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి పాల్గొన్నారు.

## రాయలసీమ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?: వైసీపీకి సోమిరెడ్డి సవాల్



రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామాకు తెరలేపిందని, ఐదేళ్ల పాలనలో వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు సమీక్షల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులపై తాము చేసిన ఖర్చు, వైసీపీ హయాంలో జరిగిన నిర్లక్ష్యంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈరోజు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు.

**రాయలసీమ లిఫ్ట్‌పై ఇప్పుడు డ్రామాలు**

2020లోనే నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఆర్ఎల్ఐఎస్) పనులపై స్టే ఇచ్చిందని సోమిరెడ్డి గుర్తుచేశారు. "అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ అల్లుడు, మంత్రి హరీశ్ రావు తామే 18 లేఖలు రాసి, కేసులు వేసి ఆర్ఎల్ఐఎస్ పనులను ఆపించామని ఆనాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో గొప్పగా చెప్పుకున్నారు. మరి, కేసీఆర్‌తో స్నేహంగా ఉన్న జగన్.. ఆ స్టేను నాలుగేళ్ల పాటు ఎందుకు ఎత్తివేయించలేకపోయారు? ఇప్పుడు అధికారం కోల్పోయాక 'గొడ్డలి పార్టీ' నాయకులు సమీక్షలు, రౌండ్ టేబుల్ సమావేశాల పేరుతో కొత్త నాటకాలు ఆడుతున్నారు. ఈ సమీక్షలు మీ తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టుకుని, ఐదేళ్లలో మీరేం చేశారో ఆత్మపరిశీలన చేసుకోండి" అని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు.

**ఖర్చులో పోలికే లేదు**

టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి ప్రాజెక్టులపై ఉన్న చిత్తశుద్ధికి ఖర్చు చేసిన నిధులే నిదర్శనమని సోమిరెడ్డి పేర్కొన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన వెంటనే 24 నెలల్లోనే ప్రాజెక్టులపై రూ. 12,484 కోట్లు ఖర్చు చేశాం. మరో రూ. 10 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ మీరు 2019 నుంచి 2024 వరకు ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయగలరా? వైసీపీ నేత, ఉరవకొండ ఇన్‌ఛార్జ్ విశ్వేశ్వర్ రెడ్డే స్వయంగా తమ ప్రభుత్వ హయాంలో సీమకు ఏమీ చేయలేకపోయామని అంగీకరించారు. దీన్నిబట్టి చూస్తే రాయలసీమకు ద్రోహం చేసింది ఎవరో స్పష్టమవుతోంది" అని విమర్శించారు.

చరిత్ర టీడీపీది.. విధ్వంసం వైసీపీది

తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటిని అత్యధికంగా పూర్తి చేసింది స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు అని సోమిరెడ్డి గుర్తుచేశారు. "జగన్ రెడ్డి జీఓ 365 పేరుతో రాయలసీమలోని 102 సాగునీటి ప్రాజెక్టుల పనులను రద్దు చేశారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోతే 39 మంది ప్రాణాలు కోల్పోయారు. కృష్ణా జలాల్లో మిగులు జలాలు కోరబోమని బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌కు లేఖ రాసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీమకు తీరని అన్యాయం చేశారు. జలయజ్ఞం పేరుతో మీరు చేసింది ధనయజ్ఞం మాత్రమే" అని ఆరోపించారు.

# పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ గ్రీన్‌సిగ్నల్

**-ఈ విద్యాసంవత్సరం నుంచే 100 ఎంబీబీఎస్ సీట్లు..**
**- కూటమి ప్రభుత్వ కృషి ఫలితమే: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**

పిడుగురాళ్ల జూలై 14 వార్త సాక్ష్యం

పల్నాడు ప్రాంత విద్యార్థుల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 2026-27 విద్యాసంవత్సరం నుంచి 100 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతి ఇవ్వడంతో వైద్య విద్యకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. ఈ ఘనత కూటమి ప్రభుత్వ ప్రత్యేక చొరవ వల్లే సాధ్యమైందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి లభించిన నేపథ్యంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం పిడుగురాళ్ల మెడికల్ కాలేజీని సందర్శించారు. కళాశాల, ఆసుపత్రిలోని వసతులను పరిశీలించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి అనుమతి రావడం కూటమి ప్రభుత్వ నిరంతర కృషికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రస్తుతం 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభమవుతున్న కాలేజీని భవిష్యత్తులో 250 సీట్లకు విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసుపత్రి సేవలను మెరుగుపరిచేందుకు 273 మంది వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందిని నియమించిందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ పనులు, హాస్టల్ నిర్మాణాలు, ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు వంటి పనులను వేగంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో రోజుకు సుమారు 400 మంది ఓపీ రోగులు చికిత్స పొందుతున్నారని, భవిష్యత్తులో మరింత మెరుగైన వైద్య సేవలు, కార్పొరేట్ స్థాయి ఉచిత చికిత్స, ల్యాబ్ పరీక్షలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ నెల 17న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి కొత్త అంబులెన్స్‌ను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గత




ప్రభుత్వంపై కూడా ఎంపీ విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మించామని చెప్పినా విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, నంద్యాల వంటి ప్రాంతాల్లోని కాలేజీలకు కనీస స్థాయిలో కూడా నిధులు కేటాయించలేదని ఆరోపించారు. పులివెందుల మెడికల్ కాలేజీకి మాత్రం వందల కోట్ల రూపాయలు వెచ్చించి, ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధతో నిధులు విడుదల చేయడంతోనే పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ అనుమతి సాధ్యమైందని ఎంపీ పేర్కొన్నారు.

# వృద్ధులే టార్గెట్...
# నకిలీ పోలీసుల దోపిడి



-నకిలీ పోలీసుల దోపిడీకి చెక్
-వృద్ధులే లక్ష్యంగా దోపిడీల పరంపర
-సీసీ కెమెరాలతో నిందితుల అరెస్టు
-నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

తెనాలి జూలై 14 వార్త సాక్ష్యం

పోలీసులమంటూ అమాయకులను, ముఖ్యంగా ఒంటరిగా వెళ్తున్న వృద్ధులను అడ్డగించి నగదు దోచుకుంటున్న ఇద్దరు అంతర్‌జిల్లా నిందితులను తెనాలి రూరల్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా అరెస్టు చేశారు. వారి వద్ద నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. పోలీసులమంటూ ప్రజలను బెదిరించి నగదు దోచుకుంటున్న ఇద్దరు అంతర్‌జిల్లా నిందితులను తెనాలి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తెనాలి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జనార్ధనరావు కేసు వివరాలను వెల్లడించారు.బాపట్ల జిల్లా చీరాలకు చెందిన కావటి కిరణ్‌కుమార్, సధుపాటి మురళి కొంతకాలంగా తెనాలి పరిసర ప్రాంతాల్లో బైక్‌పై తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని పోలీసుల పేరుతో వాహనాలు తనిఖీ చేస్తామని బెదిరించి నగదు దోచుకుంటున్నట్లు తెలిపారు. కొల్లిపరకు చెందిన వ్యక్తి వద్ద రూ.50 వేలతో పాటు మరో బాధితుడి వద్ద రూ.7 వేల నగదు అపహరించినట్లు చెప్పారు.బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.57 వేల నగదు, దోపిడీకి ఉపయోగించిన పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. నిందితులపై పలు జిల్లాల్లో 12కు పైగా కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.పోలీసుల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని, అనుమానాస్పద వ్యక్తులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ జనార్ధనరావు హెచ్చరించారు.

# ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ..
# కొత్త షెడ్యూల్ ఇదే!

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) గడువు పొడిగింపు
నేటితో ముగియాల్సిన గడువును జులై 24 వరకు పెంచుతూ ఈసీఐ నిర్ణయం
రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ విడుదల
ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి
సవరణ ప్రక్రియలో 14 లక్షల మంది మరణించినట్లు, 12 లక్షల మంది వలస వెళ్లినట్లు గుర్తింపు

జులై 14 వార్త సాక్ష్యం

ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికానందున గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

**గడువు పెంపునకు దారితీసిన కారణాలు**

గత నెల రోజులుగా ఏపీ వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూసే ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టారు. జులై 13 నాటికి దాదాపు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో, గడువును పొడిగించాలని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరాయి. పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీఈవో.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ఈసీఐ, గడువు పొడిగింపునకు అంగీకారం తెలిపింది.




సవరణలో వెల్లడైన కీలక గణాంకాలు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు మొత్తం 4,16,26,144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. సోమవారం నాటికి 3,69,50,812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశారు. ఈ ప్రక్రియలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 మంది ఓటర్లు మరణించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో 12,14,994 మంది ఓటర్లు తమ చిరునామా నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తేలింది. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లిన సమయంలో 7,26,425 మంది ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేరని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 9 శాతానికి పైగా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో, పొడిగించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**సవరించిన షెడ్యూల్ వివరాలు**

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం సవరించిన తేదీలు ఈ విధంగా ఉన్నాయి:
ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి తేదీ: జులై 24
ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ: జులై 31
అభ్యంతరాలు, చేర్పులు, మార్పుల స్వీకరణ: జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి గడువు: సెప్టెంబరు 28 ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ: అక్టోబరు 3 ఈ పొడిగించిన గడువుతో ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు అవకాశం లభించిందని అధికారులు భావిస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత పౌరులు తమ వివరాలను సరిచూసుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత సమయంలోగా తెలియజేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

# తాగునీటిని వృధా చేస్తే జరిమానా విధింపు

వార్త సాక్ష్యం జూలై 14

ఎక్కడ కూడా తాగునీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా తాగునీటిని వృధా చేస్తే జరిమానాలు విధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 5వేల జరిమానా విధించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తాగునీటి సరఫరా, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల పెంపుదల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలకు అవి ఏమేరకు సరిపోతాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి తాగునీటిని ఏమాత్రం వృధా చేయకుండా, భవన నిర్మాణాలు వంటి ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటిని వృధా చేస్తే, బాధ్యులకు జరిమానాలు విధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని నివాస ప్రాంతాలకు, ప్రజల అవసరాలకు సరిపడా రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి సంయుక్తంగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వర్షపు నీటిని ఒడిసిపడుతూ, భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవకాశం ఉన్న చోట ఫాంపాండ్స్, ఇతర వాటర్ షెడ్ నిర్మాణాలు జరిపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోయిన చోట, నీటి వనరుల లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో వీటి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఎక్కడ కూడా తాగునీటి విషయమై ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.




అదేవిధంగా ఖరీఫ్ పంటల సాగుకు ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు అవసరమైన మొదటి, రెండు తడులు నీటిని అందించేందుకు ప్రణాళి కాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్త కుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజం గరావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి ప్రకాశ్, ఆర్.డబ్ల్యూ.ఎస్ తదితర శాఖల

# 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తాం - రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

-ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు మంజూరు

-బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు.. భక్తులకు అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ

-అదనపు అభివృద్ధి పనులకు మరో రూ.50-60 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో

వార్త సాక్ష్యం జూలై 14

2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో వీఐపీ ఘాట్లు, సాధారణ స్నాన ఘాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, బైపాస్ రోడ్లు, రహదారుల విస్తరణ, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, ఉగ్ర నరసింహస్వామి ఆలయం, కోటిలింగాల దేవస్థానం పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులను పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల ప్రణాళికలు, అంచనాలు, కాలపట్టికలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని నాణ్యతతో, వేగంగా పూర్తి చేసేలా తగిన సూచనలు అందించారు. తొలి విడతలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి తెలిపారు.తెలంగాణ ప్రజలందరూ భగవంతుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి 2027 గోదావరి పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.జూలై-2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేబినెట్ ఉపసంఘం నిర్ణయం మేరకు బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన దేవాలయాల పునరుద్ధరణతో పాటు పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లను కేటాయించిందనిఅందులో ధర్మపురి, కోటిలింగాల పుష్కరాల ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తొలి విడతలో రూ.117 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు.క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ధర్మపురి, కోటిలింగాలను



సందర్శించారని, అధికారులు నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.దేశంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా బాసర, కాళేశ్వరం, వేములవాడ, యాదాద్రి, భద్రాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి అనుగ్రహం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడం లో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ సంగనభట్ల దినేష్, దేవాలయం ఈవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ లు, పంచాయతీ రాజ్ ఏఈ లు, రోడ్డు భవనాల శాఖ ఏఈ లు, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్రం ముందడుగు

# కార్మికుల హక్కు సాధనకు ఎంపీ గడ్డం వంశీకృష్ణ పోరాటం ఫలిస్తోంది

వార్త సాక్ష్యం జూలై 14

కేంద్ర కార్మిక & ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా, రాష్ట్ర కార్మిక,ఉపాధి,శిక్షణ & ఫ్యాక్టరీలు,గనులు & భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామిలి తో కలిసి రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పార్టీ తరఫున కాన్ఫరెన్స్ కాల్ ద్వారా పాల్గొని, గతంలో టెండర్ దశ వరకు వెళ్లి నిలిచిపోయిన రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాజెక్టును వెంటనే పునఃప్రారంభించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ...రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి సింగరేణి కార్మికులు,పారిశ్రామిక కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న హక్కు అని పేర్కొన్నారు. వేలాది మంది కార్మిక కుటుంబాలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలంటే ఈ ఆసుపత్రి నిర్మాణం అత్యవసరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సమన్వయంతో అన్ని పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి,నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆయన



కోరారు.ఈ అంశాన్ని పార్లమెంట్‌లో కూడా పలుమార్లు ప్రస్తావించినట్లు గుర్తు చేసిన ఎంపీ, రామగుండంఈఎస్ఐ ఆసుపత్రి పూర్తయ్యే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగు తుందని స్పష్టం చేశారు.కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ,రాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామిఈ అంశంపై సానుకూలంగా స్పందించడం పట్ల ఎంపీ వంశీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల ఆరోగ్య భద్రతే మా ప్రాధాన్యం... రామగుండం ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే వరకు మా పోరాటం ఆగదు అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



వార్త సాక్ష్యం జూలై 14

జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి.ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్,ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## నిబంధనల ప్రకారం పోడు భూముల సమస్యల పరిష్కారం

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



వార్త సాక్ష్యం జూలై 14

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్,కోటపల్లి సి.ఐ. కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టానికి లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని తెలిపారు.అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్ ను పరిశీలించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై కేవీపీఎస్ సర్వే

-విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

-కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి పాలడుగు నాగార్జున



వార్త సాక్ష్యం జూలై 14

నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కమిటీ సర్వే నిర్వహించింది.ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ,సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శిం చారు. విద్యా సంవత్సరం ప్రారంభమై చాలా రోజులు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు నోటు పుస్తకాలు అందలేదని,గత పదేళ్లుగా ప్లేట్లు, గ్లాసులు కూడా పంపిణీ చేయలేదని ఆరోపించారు.ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయ కుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తు న్నారని అన్నారు. జిల్లాలోని అనేక సంక్షేమ హాస్టళ్లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని,ఫిల్టర్ ప్లాంట్లు పనిచేయడం లేదని,ఇన్వర్టర్లు మరమ్మతులకు నోచుకోక విద్యుత్ అంతరాయం సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బెడ్లు, పరుపులు, దుప్పట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలు కూడా అనేక హాస్టళ్లలో లేవని పేర్కొన్నారు.వెంటనే అన్ని హాస్టళ్ల విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ, ప్లేట్లు, గ్లాసులు, బెడ్లు,పరుపులు, దుప్పట్లు అందించాలని, తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపర్చాలని,ఫిల్టర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లను మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను విడుదల చేసి,సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో సమగ్ర సర్వే నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని, సమస్యలు పరిష్కరిం చకపోతే విద్యార్థులు, ప్రజాసం ఘాలతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు,కలెక్టరేట్ ముట్టడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఒంటెపాక కృష్ణ, విద్యార్థులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
బుధవారం 15 జూన్, 2026

# బిజినెస్

## ఉడాన్ పథకం మరో పదేళ్లు పొడిగిస్తున్నాం




ఉడాన్ పథకాన్ని మరో పదేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. రూ.30 వేల కోట్లతో 100 కొత్త ఎయిర్‌పోర్టులు, 200 హెలిపోర్టులే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. భారత్‌ను ప్రపంచ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. 2028 జూన్ 2వ తేదీ నాటికి వరంగల్ ఎయిర్‌పోర్ట్‌ను పూర్తి చేయడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈరోజు (మంగళవారం) ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో రామ్మోహన్ మాట్లాడారు.

**బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరును తీర్చిదిద్దుతాం..**

బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరును తీర్చిదిద్దుతామని రామ్మోహన్ పేర్కొన్నారు. తన హయాంలోనే మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను వేగవంతం చేయాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. బౌండరీ వాల్, రన్‌వే టెండర్లు సిద్ధం చేశామని వెల్లడించారు. 3 నుంచి 4 వారాల్లో టెర్మినల్ భవనం టెండర్లు పిలుస్తామని వివరించారు. కాకతీయ కళావైభవాన్ని ప్రతిబింబించే విధంగా టెర్మినల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. దేశంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్ట్‌గా వరంగల్‌ను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

**ఆదిలాబాద్ ప్రాజెక్ట్‌కు సుమారు 1,500 ఎకరాల భూసేకరణ చేయాలి..**

రాష్ట్ర ప్రభుత్వం 253 ఎకరాల భూమిని రికార్డు సమయంలో అప్పగించిందని రామ్మోహన్ తెలిపారు. వరంగల్ ప్రాజెక్టులో ఎలాంటి జాప్యం లేదని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ - సివిలియన్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయని వెల్లడించారు. ఆదిలాబాద్ ప్రాజెక్ట్‌కు సుమారు 1,500 ఎకరాల భూసేకరణ చేయాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వేగంగా భూమి ఇవ్వడంతో ఆ ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెరిగిందనిపేర్కొన్నారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాలను ఒకలా ఎన్డీఏలో లేని రాష్ట్రాలను ఒకలా చూడటం లేదని తేల్చిచెప్పారు. దేశ అభివృద్ధి కోణంలోనే పనులు జరుగుతున్నాయని వివరించారు. ఆయా ప్రాజెక్టుల పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అవసరమని తెలిపారు. భూసేకరణ రాష్ట్రాల పరిధిలోని అంశమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో భూసేకరణ చేసిందని.. అందుకే అభినందిస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## బీఎస్ఎన్ఎల్‌కు నెలకు ఒక్కో యూజర్ నుంచి ఎంత ఆదాయం వస్తుందో తెలుసా?



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పనితీరులో సానుకూల వృద్ధి కనిపిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) సంస్థ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం దాదాపు 10 శాతం పెరిగినట్లు కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ తొలి త్రైమాసిక పనితీరుపై జరిగిన సమీక్షా సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బీఎస్ఎన్ఎల్ రూ. 4,017 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయగా, ఈ ఏడాది అదే కాలానికి అది రూ. 4,418 కోట్లకు చేరిందని సింధియా తెలిపారు. తద్వారా సంస్థ ఆదాయంలో రూ. 401 కోట్ల పెరుగుదల నమోదైందని వివరించారు. ఈ వృద్ధికి ప్రధానంగా ఎంటర్‌ప్రైజ్ బిజినెస్, కన్స్యూమర్ మొబిలిటీ విభాగాలు దోహదపడినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, కన్స్యూమర్ ఫిక్స్‌డ్ యాక్సెస్ విభాగంలో మాత్రం వృద్ధి దాదాపు నిలకడగా ఉందని చెప్పారు. ఈ త్రైమాసికంలో బీఎస్ఎన్ఎల్ ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) కూడా పెరిగినట్లు మంత్రి తెలిపారు. గతంలో రూ. 100గా ఉన్న ఏఆర్‌పీయూ, రూ. 102.7కు చేరిందని ఆయన పేర్కొన్నారు. సంస్థ పనితీరును మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

## ఫ్రెషర్లకు షాక్.. హెచ్‌సీఎల్‌టెక్ నియామకాల్లో భారీ మార్పు!




ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో ఐటీ రంగంలో నియామకాల తీరు వేగంగా మారుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోని మూడో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ కొత్త వ్యూహాన్ని అమలు చేయనుంది. ఇకపై పెద్ద సంఖ్యలో ఫ్రెషర్లను నియమించుకోవడం కంటే ప్రత్యేక నైపుణ్యాలున్న ఇంజినీర్లను ఎంపిక చేయడంపైనే దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించింది. అలాంటి వారికి సాధారణ ఫ్రెషర్లతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపింది. హెచ్‌సీఎల్‌టెక్ 'చీఫ్ పీపుల్ ఆఫీసర్' రామ్ సుందరరాజన్ ఈ విషయాన్ని వెల్లడించారు. రానున్న రెండు నుంచి మూడేళ్లలో ప్రత్యేక నైపుణ్యాలున్న ఇంజినీర్ల బృందాన్ని తయారు చేయనున్నట్లు చెప్పారు. వీరిని 'ఫార్వర్డ్ డిప్లాయిడ్ ఇంజినీర్లు'గా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. కస్టమర్ల వ్యాపార అవసరాలను అర్థం చేసుకుని ఏఐ ఆధారిత పరిష్కారాలను వేగంగా అందించే బాధ్యత వీరిపై ఉంటుందని వివరించారు. సంప్రదాయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పోలిస్తే ఈ విభాగంలో పనిచేసే వారికి సాంకేతిక నైపుణ్యాలతో పాటు కస్టమర్లతో నేరుగా పనిచేసే సామర్థ్యం కూడా అవసరమని సంస్థ తెలిపింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఇంజినీరింగ్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వంటి రంగాల్లో నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఎంపికైన వారికి సాధారణ ఫ్రెషర్ల వేతనంతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ ప్యాకేజీ ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఏఐ ప్రాజెక్టుల్లో చేరిన వెంటనే పనిచేయగలిగే ఉద్యోగులను సంస్థలు కోరుకుంటున్నాయని హెచ్‌సీఎల్‌టెక్ పేర్కొంది. దీంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తీసుకుని తర్వాత శిక్షణ ఇవ్వడం కంటే, ముందుగానే నైపుణ్యాలు ఉన్న వారిని ఎంపిక చేసే విధానానికి ప్రాధాన్యం పెరుగుతోందని వివరించింది.

---

# స్పోర్ట్స్

## జపాన్ ఓపెన్ టోర్నీ: పీవీ సింధు శుభారంభం

ఇంటర్నెట్ డెస్క్:

భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై వరుస గేమ్‌ల్లో విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. ప్రపంచ 10వ ర్యాంకర్, మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధు.. ప్రపంచ 37వ ర్యాంకర్ వాంగ్‌ను 21-14, 21-11 తేడాతో అలవోకగా ఓడించింది. ఆరంభం నుంచే మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు.. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా కేవలం రెండు గేమ్‌ల్లోనే పోరును ముగించింది. మొదటి గేమ్‌లో 7-4 ఆధిక్యం సాధించిన సింధు.. నెట్ డ్రాప్‌లు, హాఫ్ స్మాష్‌లు, కచ్చితమైన షాట్లతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. వాంగ్ చేసిన వరుస తప్పిదాలను సద్వినియోగం చేసుకుంటూ తొలి గేమ్‌ను 21-14తో కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో మరింత దూకుడుగా ఆడిన సింధు.. 8-2, ఆపై 11-3తో భారీ ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత కూడా అదే జోరు కొనసాగిస్తూ 16-5తో ముందంజలో నిలిచింది. చివరికి వాంగ్ మరోసారి తప్పిదం చేయడంతో 21-11తో గేమ్‌ను ముగించి రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టింది.




**-మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా..**

మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ ధ్రువ్ కపిలా--తనిషా క్రాస్టో కూడా విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డన్--జూలీ మాక్‌ఫర్సన్ జోడీని 21-16, 21-14తో ఓడించింది. అయితే మరో భారత జోడీ రోహన్ కపూర్--రుత్విక శివానీ గద్దే మాత్రం ఓటమిని చూసింది. తొలి రౌండ్‌లోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాప్ సీడ్ చైనా జోడీ ఫెంగ్ యాన్ జే--హువాంగ్ డాంగ్ పింగ్ చేతిలో 11-21, 10-21 తేడాతో ఓడిపోయింది.

## గంభీర్-కోహ్లీ మధ్య కోల్డ్ వార్? ప్రాక్టీస్ సెషన్ వీడియోలు వైరల్

ఇంటర్నెట్ డెస్క్:





భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య మళ్లీ విభేదాలు తలెత్తాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంగ్లండ్‌తో టీమిండియా మూడు వన్డేల సిరీస్ ఆడుతోంది. తొలి వన్డే మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో వీరిద్దరూ మాట్లాడుకోకపోవడం చర్చనీ యాంశం అయింది. నెట్స్‌లో గంభీర్ ఇతర ప్లేయర్లతో మాట్లాడి నప్పటికీ.. కోహ్లీతో మాత్రం ఒక్కసారి కూడా మాట్లాడలేదని వార్తలు వస్తున్నాయి. దీనికి సంబంధించిన ప్రాక్టీస్ సెషన్ వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గంభీర్ ఎక్కువ సమయం కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు రోహిత్ శర్మ, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్, ఇతర సహాయక సిబ్బందితోనే చర్చలు జరిపారు. అయితే మొత్తం ప్రాక్టీస్ సెషన్‌లో కోహ్లీతో గంభీర్ ప్రత్యక్షంగా మాట్లాడిన దాఖలాలు కనిపించలేదని వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో విరాట్ కోహ్లీ తన బ్యాటింగ్ ప్రాక్టీస్‌ను సితాన్షు కోటక్ పర్యవేక్షణలో పూర్తి చేశాడు. ప్రాక్టీస్ తర్వాత కోటక్‌తో కోహ్లీ సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. గతంలో ఐపీఎల్ సందర్భంగా గంభీర్, కోహ్లీ మధ్య వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రొఫెషనల్ ప్లేయర్లలా కలిసే పని చేశారు. మళ్లీ ఇప్పుడు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు వీరిద్దరూ మాట్లాడుకోవడం లేదంటూ వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టీ20ల్లో క్లీన్ స్వీప్ అయిన టీమిండియా.. వన్డేలో గెలవాలని ఆశిస్తోంది. ఇలాంటి సమయంలో కోహ్లీ, గంభీర్ మధ్య విభేదాలు మ్యాచ్ ఫలితాలపై ప్రభావం చూపుతాయా? అంటూ అభిమానులు గందర గోళానికి గురవుతున్నారు.

## టీమిండియా కోచింగ్ స్టాఫ్‌లో మార్పులు

### రాజీనామాకు సిద్ధమైన ర్యాన్ టెన్




టీమిండియా సహాయక కోచ్ ర్యాన్ టెన్ దస్కాటే తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. వ్యక్తిగత కారణాల రీత్యా బాధ్యతల నుంచి తప్పుకోవాలని అనుకుంటున్నట్టు ఆయన బీసీసీఐకి ఇప్పటికే తెలియజేసినట్లు తెలుస్తోంది. అయితే ఆయన రాజీనామాకు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇంకా తుది ఆమోదం తెలపలేదని జాతీయ మీడియా వెల్లడించింది.నెదర్లాండ్స్‌కు చెందిన ర్యాన్ టెన్ రెండేళ్ల క్రితం గౌతమ్ గంభీర్ కోచింగ్ బృందంలో భాగంగా భారత జట్టుతో పని చేయడం ప్రారంభించారు. ఆయన ఒప్పందం తాజాగా ముగిసినప్పటికీ పొడిగించే అవకాశం ఉంది. అయితే తన కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతో కోచింగ్ బాధ్యతల నుంచి వైదొలగాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. లండన్‌లో నివసిస్తున్న తన భార్య, ముగ్గురు పిల్లలతో గడపడం కోసమే ఆయన తన బాధ్యతల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నుంచి అనుమతి లభిస్తే, భారత జట్టుతో ఇదే ర్యాన్ టెన్ చివరి వారం కావచ్చు. ఇంగ్లండ్‌తో జులై 19న జరిగే మూడో వన్డే భారత డ్రెస్సింగ్ రూమ్‌లో అతడి చివరి రోజు కావచ్చు. కాగా గౌతమ్ గంభీర్, ర్యాన్ టెన్ మధ్య మంచి వ్యక్తిగత, వృత్తిపరమైన అనుబంధం ఉంది. భారత జట్టుకు సహాయ కోచ్‌గా ర్యాన్ టెన్‌ను ఎంపిక చేయడంలో కూడా గంభీర్ కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో ర్యాన్ టెన్ రాజీనామాను గంభీర్ ఆమోదిస్తాడో లేదో చూడాలి. ఇదిలా ఉండగా, ర్యాన్ టెన్ రాజీనామా అంశంపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. బోర్డు, ప్రధాన కోచ్ ఆమోదం లభించిన తర్వాతే ర్యాన్ టెన్ నిష్క్రమణ పై తుది నిర్ణయం వెలువడనుంది.



# ‘తెలుగు సినిమా.. హిందీ సినిమా’ ఇదేం విభజన? - అడివి శేష్

భాషల ఆధారంగా సినిమాలను విభజించే విధానంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని హీరో అడివి శేష్ అభిప్రాయపడ్డాడు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలను ఒకే భాషకు పరిమితం చేయడం సరైన విధానం కాదన్నాడు. దేశమంతా ఆదరించే కథలకు భాష అడ్డంకిగా మారకూడదని అభిప్రాయపడ్డాడు. ఇప్పటికీ ‘హిందీ సినిమా’, ‘తెలుగు సినిమా’, ‘తమిళ సినిమా’ అంటూ వేర్వేరుగా పిలుస్తూనే, మరోవైపు ‘పాన్ ఇండియా సినిమా’ అనే పదాన్ని ఉపయోగించడం ఆసక్తికరంగా అనిపిస్తోందని శేష్ చెప్పాడు. ఒక సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచగలిగితే దాని గుర్తింపును భాషతో ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించాడు. కథలను భాషల గీతల్లో కాకుండా భారతీయ కథలుగా స్వీకరించినప్పుడే నిజమైన పాన్ ఇండియా సినిమా ఆవిష్కృతమవుతుందని అన్నాడు. భాష అనేది భావాలను వ్యక్తీకరించే సాధనం మాత్రమేనని, అది ఎప్పుడూ పరిమితిగా మారకూడదని అడివి శేష్ పేర్కొన్నాడు. ఇప్పుడు ప్రేక్షకులు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయారని చెప్పాడు. మంచి కథ ఎక్కడి నుంచి వచ్చినా ఆదరిస్తున్నారని, ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టు సినీ పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఉందన్నాడు. సినీ సృష్టికర్తల బాధ్యత నిజాయతీతో కూడిన కథలను అందరికీ చేరేలా రూపొందించడమేనని శేష్ అన్నాడు. ఒక భాష మార్కెట్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా దేశం మొత్తం సొంతం చేసుకునే సినిమాలను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుతం అడివి శేష్ నటించిన ‘డెకాయిట్: ఏ లవ్ స్టోరీ’ విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. అలాగే ‘గూఢచారి’కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న ‘జీ2’ చిత్రంలో కూడా అడివి శేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, వామికా, మధు శాలిని ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.



# ఐమాక్స్ ఫార్మాట్‌లో ‘మహాకాళి’ చివరి దశకు చిత్రీకరణ

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రాబోతున్న మరో ప్రతిష్ఠాత్మక చిత్రం ‘మహాకాళి’. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన ‘హనుమాన్’ తర్వాత వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పూజ కొల్లూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే 125 రోజుల పాటు సుదీర్ఘంగా చిత్రీకరణ జరుపుకున్న ‘మహాకాళి’, ఇప్పుడు తుది షెడ్యూల్‌లోకి ప్రవేశించింది. ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నాతో పాటు యువ నటుడు రోహిత్ షరాఫ్ తమ పాత్రలకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రేక్షకులకు అత్యున్నత స్థాయి విజువల్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావస్తు ఒడటంతో, త్వరలోనే విడుదల తేదీతో పాటు మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లను ప్రకటిస్తామని చిత్ర యూనిట్ వెల్లడించింది. ‘హనుమాన్’ యూనివర్స్‌లో రాబోయే ఈ కొత్త అధ్యాయం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# విజయ్ సేతుపతి ‘ట్రైన్’ వచ్చేస్తోంది- రిలీజ్ ఆగస్టులోనే

మక్కల్ సెల్వన్’ విజయ్ సేతుపతి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ ‘ట్రైన్’. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో థియేటర్లలో విడుదల చేయను న్నట్లు ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను అధికారికంగా ప్రకటించారు. చెన్నైలో ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన 43 సెకన్ల నిడివి గల టీజర్, చిత్రంపై అంచనాలను భారీగా పెంచింది. వేగంగా దూసు కెళ్తున్న ‘బ్లూ మౌంటెన్ ఎక్స్‌ప్రెస్’ రైలును కొంత మంది సాయు ధులు తమ అధీనంలోకి తీసుకో వడం, ఆపదలో ఉన్న ప్రయాణికులను కాపాడేం దుకు విజయ్ సేతుపతి చేసే వీరోచిత పోరాటం వంటి ఉత్కంఠభరిత సన్నివేశాలతో టీజర్‌ను ఆక ట్టుకునేలా రూపొం దించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ, “ఈ సిని మాను ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసు కువస్తాం” అని పేర్కొనగా, దర్శకుడు మిస్కిన్ సర దాగా జోక్యం చేసుకుంటూ కచ్చితమైన తేదీని ప్రకటించాలని కోరారు. ఆగస్టు 14న మరో సినిమా ఉందంటూ ఆయన చమత్కరించడంతో సభలో నవ్వులు పూ శాయి. ఈ చిత్రానికి కథ అందించడమే కాకుం డా, మిస్కిన్ స్వయంగా సంగీతాన్ని సమకూర్చడం విశేషం. ఈ కథను ప్రత్యేకంగా విజయ్ సేతుపతి కోసమే సిద్ధం చేశానని, ఆయన తరహా నటనను కమల్ హాసన్, అమీర్ ఖాన్ వంటి దిగ్గజ నటులు సైతం ప్రదర్శించలేరని మిస్కిన్ ప్రశంసల వర్షం కురిపిం చారు. 2023లో ప్రారంభమైన ఈ చిత్రంలో శ్రుతి హాసన్, నాజర్, యుగి సేతు, నరైన్, కేఎస్ రవికుమార్, సంపత్ రాజ్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఇందులో నరైన్ పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో, ఇది మిస్కిన్ గత చిత్రం ‘అంజాదే’కు కొనసాగింపు కావచ్చని, తద్వారా ‘మిస్కిన్ సినిమాటిక్ యూనివర్స్’కు అంకు రార్పణ జరుగుతోందని సినీ వర్గాల్లో ఊహాగా నాలు వినిపిస్తున్నాయి. ఆగస్టులో చిత్ర విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటిం చనున్నా రు.




# ‘పరిమళ అండ్ కో’ (జీ 5) మూవీ రివ్యూ!

కోలీవుడ్ లో దర్శకుడిగా పాండిరాజ్ కి మంచిపేరు ఉంది. వైవిధ్యభరితమైన కథలను తెరపై వినోదభరితంగా .. ఆసక్తికరంగా ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత. కామెడీ టచ్ ఇస్తూనే ఎమోషన్స్ ను కనెక్ట్ చేయడంలో సిద్ధహస్తుడు. ఆయన రూపొందించిన సినిమానే ‘పరిమళ అండ్ కో’. జయరామ్ ప్రధానమైన పాత్రగా తెరకెక్కిన ఈ సినిమా, జూన్ 5వ తేదీన థియేటర్లకు వచ్చింది. బ్లాక్ కామెడీ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సినిమా, ఈ నెల 10వ తేదీ నుంచి ‘జీ 5’ లో ఐదు భాషల్లో అందుబాటులోకి వచ్చింది. నగరంలో పరిమళ ( జయరామ్) తన కుటుంబంతో కలిసి నివసిస్తూ ఉంటాడు. అప్పారావు (యోగిబాబు) ఇంట్లో చాలా కాలం నుంచి అద్దెకి ఉంటాడు. ఆయన భార్య స్వరాజ్యం (ఊర్వశి) కూతుళ్లు పరాశక్తి (సంజనా కృష్ణమూర్తి) మధుమిత (అనంతిక). పరిమళ మిడిల్ క్లాస్ ఫ్యామిలీని చాలా పొదుపుగా నెట్టుకొస్తుంటాడు. అయితే ఆ సిటీలో వర్గీస్ (శాండీ) అనే జులాయి తిరుగుతూ ఉంటాడు. అతను నగరంలోని కాలేజ్ కుర్రాళ్లకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తుంటాడు. అతని వెనక రాజకీయనాయకులు ఉండటంతో పోలీసులు వెనకడుగు వేస్తుంటారు. ‘జాలరిపేట’కి చెందిన వర్గీస్, హత్యలు చేయడానికి కూడా ఎంతమాత్రం వెనుకాడడు. అందువలన అతనంటే అక్కడి వాళ్లంతా భయపడుతుంటారు. ప్రేమిస్తున్నానంటూ అతను మధుమిత వెంటపడుతూ ఉంటాడు. పరిమళతో పాటు అతని పెద్ద కూతురు .. చిన్నకూతురు ఎంతగా మందలించినా అతను వినిపించుకోడు. వర్గీస్ తల్లి సురేఖావాణి కూడా ఆ ఏరియాలో తన దందా కొనసాగిస్తూ ఉంటుంది. మధుమిత విషయంలో ఆమె కొడుకును మరింత సపోర్ట్ చేస్తుంది. దాంతో వర్గీస్ చనిపోతేనే తాము ప్రశాంతంగా బ్రతకగలమని పరిమళ భావిస్తాడు. మిగతా కుటుంబ సభ్యులంతా అతని నిర్ణయానికి తమ మద్దతును తెలియజేస్తారు. చిట్టీ ( సంతోష్ శోభన్)అనే యుకుడిని పరాశక్తి ప్రేమిస్తూ ఉంటుంది. వర్గీస్ విషయంలో తమ ఫ్యామిలీ తీసుకున్న నిర్ణయాన్ని గురించి ఆమె చిట్టీతో చెబుతుంది. ఆ మరుసటి రోజునే వర్గీస్ దారుణంగా హత్య చేయబడతాడు. ఈ వార్త బయటికి రాగానే, సిటీ అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. వర్గీస్ చనిపోవడానికి ముందు అతనికి పరిమళ ఫ్యామిలీతో గొడవ జరిగిందని తెలుసుకున్న సురేఖావాణి, తన అనుచరులతో బయల్దేరుతుంది. వర్గీస్ తో పరిమళకు గల గొడవను గురించి తెలుసుకున్న పోలీస్ టీమ్ కూడా పరిమళ ఇంటికి బయల్దేరుతుంది. తన ఫ్యామిలీ ప్రమాదంలో పడుతుందని గ్రహించిన పరిమళ ఏం చేస్తాడు? అతను తీసుకున్న నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది? వర్గీస్ ను హత్య చేసింది ఎవరు? అనేది మిగతా కథ. ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఒక రౌడీ హత్య కేసులో చిక్కుకుంటుంది. ఆ ఫ్యామిలీ కోసం ఒక వైపున పోలీస్ ఆఫీసర్ ఏడుకొండలు గాలిస్తుంటే, మరో వైపున ఆ రౌడీ తాలూకు గ్యాంగ్ వెంటాడుతూ ఉంటుంది. వాళ్ల బారి నుంచి ఆ ఫ్యామిలీ తప్పించుకో గలుగుతుందా? ప్రాణాలతో బయటపడ గలుగుతుందా? వర్గీస్ హత్య వెనకున్న సూత్రధారులు ఎవరు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. మధ్యతరగతి కుటుంబీకులు పరువుకు ప్రాణం ఇస్తుంటారు. డబ్బు .. అధికారం .. రాజకీయనాయకుల అండదండలు ఉన్నవారు, మిడిల్ క్లాస్ అమ్మాయిలను టార్గెట్ చేస్తుంటారు. అలాంటివారైతే పరువుకు భయపడి బయటికి రారనీ, తమని ఏమీ చేయలేరనే ఒక ధైర్యంతో ఉంటారు. అయితే అలాంటి మిడిల్ క్లాస్ ఫ్యామిలీని కాపాడుకోవడానికి తండ్రి అనేవాడు ఎంతకైనా తెగిస్తాడనే విషయాన్ని చాటి చెప్పిన సినిమానే ‘దృశ్యం’. అలాంటి ఒక సినిమాను పోలినదిగా ‘పరిమళ అండ్ కో’ కనిపిస్తుంది. అయితే కంటెంట్ పరంగా ఇది ‘దృశ్యం’ సినిమాకి పూర్తి భిన్నంగా ఉంటుంది. ‘దృశ్యం’ సినిమా సీరియస్ గా కొనసాగితే, ఈ సినిమా మాత్రం కామెడీ టచ్ ఇస్తూ ఫ్యామిలీ ఎమోషన్స్ ను కనెక్ట్ చేస్తుంది. హంతకుడు ఎవరనేది చివరివరకూ ఆడియన్స్ కనుక్కోలేని విధంగా దర్శకుడు ఈ కథను నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.